


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## త్వమేవాహం

**"ఏమండీ"**

"ఊఁ" తొలి రాత్రి అనుభవాన్ని ఆస్వాదిస్తూ జీరగా పలికింది సుమంత్ కంఠం.

"మీకు ఏమిష్టం?" బిడియంగా అడిగింది ఆముక్తమాల్యద.

"వెన్నెల. అది ఏ మాసంలో అయినా సరే. వేసవిలో మల్లెపూల వెన్నెల శరత్తుతో మంచుపూల వెన్నెల."

ఒక్క ఉదుటున లేచి కూర్చుని కళ్ళు పెద్దవి చేసి అతని వంక చూసింది. ఆ తర్వాత ఆపుకోలేక పొట్ట పట్టుకుని నవ్వసాగింది ఆముక్త.

బిత్తరపోయాడు సుమంత్. కళ్ళు వెంట నీళ్ళు వచ్చేలా విరగబడి నవ్వుతున్న భార్యని అయోమయంగా చూస్తూ అడిగాడు.

"ఎందుకంత నవ్వు?"

"మరి? నేను అడిగింది మీకు ఇడ్లీ ఇష్టమా, దోసె ఇష్టమా లాంటి ఇష్టాలు. మీరేమో మల్లెపూలు, మంచుపూలు.." మళ్ళీ నవ్వసాగింది.

"ఏంటీ ఇడ్లీలు, దోసెలా? ఇంత మంచి రాత్రి మాట్లాడడానికి నీకు అంతకన్నా మంచి విషయాలు తట్టలేదా ముక్తా?" బాధగా అడిగాడు.

"అది కాదండి. మనది అరేంజ్డ్ మేరేజ్ కదా. అందుకని మీ ఇష్టాఇష్టాలు తెలిస్తే, రేపు మనం కాపురం పెట్టాక ఆ ప్రకారం చేయుచ్చు అని."

పక్కకి జరిగి ఆమె ఒళ్ళో తలపెట్టుకుని ఆమె మెళ్ళోంచి వేలాడే పసుపు తాడుని వేలితో చుడుతూ చెప్పాడు సుమంత్.

"ముక్తా. నిన్ను చూడడానికి ముందే నీ పేరు నచ్చింది. సెలవులకి మా మామయ్య ఇంటికి వెళ్ళినప్పుడు 'అనుక్షణికం' అని వడ్డెర చండీదాస్ రాసిన నవల చదివాను. అందులో స్వప్నరాగలీన అనే పేరు, ఆమె వర్ణన నన్ను ఎంతకాలం వెంటాడాయో తెలుసా? తర్వాత నీ పేరు కూడా నాకు నచ్చింది. ఆ తర్వాత నువ్వు నచ్చావు. ఇంత పొయెటిక్ పేరు పెట్టిన మీనాన్న నుంచి నీక్కూడా కొంత భావుకత వచ్చి ఉంటుందని ఆశపడ్డాను తెలుసా?"

అతని వంక కొద్దిగా జాలిగా చూస్తూ చెప్పింది ఆముక్త.

"నాకు మీరు మాట్లాడింది ఒక్క ముక్క అర్థం కాలేదు. నాకీపేరు మా నాన్న పెట్టలేదు. ఆయన స్నేహితుడు ఒక కవిగారు ఉండేవారు. ఆయన నన్ను చూసి 'బాల గోదాదేవిలా ఉంది. పాపకి ఆముక్త మాల్యద అని పేరు పెట్టు' అని చెప్పారుట. అంతే. నాకీ పేరు ఇష్టం కూడా లేదు. చక్కగా రెండు మూడు అక్షరాల పేర్లు పెట్టకుండా ఇంత పొడుగు పేరా అని కోపం కూడా."

"నువ్వు పుస్తకాలు చదవవా ముక్తా?"

"పరీక్షలప్పుడు క్లాస్ పుస్తకాలు పట్టుకుంటేనే ఆవలింతలు వస్తాయి. ఇక కథల పుస్తకాలు కూడానా? అస్సలు చదవను."

●●●

"ఏమండీ"

"ఏంటి?"

"మీ క్రెడిట్ కార్డ్‌తో ఆరువేలకి ఏదో కొన్నారని ఎస్.ఎం.ఎస్ వచ్చింది. నాకోసం చీరకొన్నారా?"

"లేదు ముక్తా. పుస్తకాలు కొన్నాను. చాలా రేర్ కలెక్షన్ దొరికింది తెలుసా?"

"ఏమిటీ? ఆరువేల రూపాయల పుస్తకాలు కొన్నారా?" కోపంగా అరిచింది ఆముక్త.

"అవును. వాటికోసం ఎప్పటినుంచో వెదుకుతున్నాను. లక్కీగా రీ ప్రింట్స్ వచ్చాయి. కాఫీ ఇస్తావా?"

"మీకు బొత్తిగా సంసారుల లక్షణాలు లేవండీ. ఇంతింత వృధా ఖర్చులు పెడుతుంటే రేపు పిల్లలు పుట్టాక ఎట్లా పెంచుతాం?" ఆగ్రహంగా అడిగింది.

సుమంత్ మొహం ఎర్రబడింది.

"నా కోసం ఖర్చు పెట్టుకునే స్వాతంత్ర్యం లేదా నాకు?"

"లేదు. పెళ్ళయ్యాక మనం తప్ప, నా, నీ లేవు. భావుకత అంటారు కదా? ఆ మాత్రం తెలీదా?"

"ఓహో! చీరలు నాకోసం. నగలు నా కోసం."

"అవును. మీకోసమే. మీ భార్య అందరితో బావుండాలంటే అవి కొనక తప్పదు. లేదా మీకే పరువు నష్టం."

మూర్ఖంగా మాట్లాడుతున్న ఆమెకి సమాధానం చెప్పలేక మౌనంగా ఉండిపోయాడు సుమంత్.

అందమైన ఆముక్తమాల్యదకి స్పందించే మనసులేదు. అందరితో పోల్చుకోవడం అసంతృప్తి చెందడం మాత్రమే తెలుసు. అందరు భర్తల్లా సుమంత్ సమర్థుడుకాడని, తన బావలా రుపాయిని పది రూపాయలు చేయడని, పనికి మాలిన కవిత్వాలు, కథలు చదవడంతో కాలం వృధా చేస్తాడని గాఢంగా నమ్ముతుంది. కానీ చుట్టు పక్కల వారు 'ముక్తా నువ్వెంత అదృష్టవంతురాలివి. సుమంత్ ఆఫీసవగానే ఇంటికి వచ్చేస్తాడు. ఇంట్లో ఉన్నంత సేపూ నీ చుట్టు తిరుగుతూంటాడు' అన్నప్పుడల్లా కించిత్ గర్వంగా కూడా ఉంటుంది.

●●●

"ముక్తా"

"ఏంటి?" పూర్తయిన మల్లెపూల దండని మునిపంటితో కొరికి రెండు ముక్కలు చేస్తూ అడిగింది.

"అబ్బ! ఈ ఫోజ్‌లో ఎంత బావున్నావో తెలుసా?"

చిరునవ్వు నవ్వింది.

"తెలుసు"

"మరి నాదో చిన్న కోరిక. తీరుస్తావా?"

"కొత్త పుస్తకం మార్కెట్‌లోకి వచ్చిందా?

"అబ్బ! కాదు ముక్తా. నువ్వు ఇవాళ ఎంత బావున్నావో."

"అయితే?"

"నువ్వు ఒప్పుకోవాలి మరి"

"సరే. ఏంటది?"

"మొన్న పండక్కి కొనుక్కున్నావు చూడు. మెత్తటి, తెల్లటి కాటన్ చీర. ఈ రాత్రికి అది కట్టుకుంటావా"

"ఊహూ. ఇస్త్రీకి నాలుగు రూపాయలు దండగ."

విలవిల్లాడుతూ చూసాడు సుమంత్.

"నేనింత రొమాంటిక్‌గా ఆలోచిస్తూంటే నువ్వు ఇస్త్రీ డబ్బుల గురించి ఆలోచిస్తున్నావా ముక్తా?" జాలిగా అడిగాడు.

"కాటన్ చీర కదండీ. నలిగిపోదూ? అదీకాక లైటార్పేస్తే చీకట్లో అదే చీరో ఏం తెలుస్తుంది?"

"చాలు. ఆపు" రెండు చేతుల్తో చెవులు మూసుకున్నాడు.

తనేం తప్పు మాట్లాడిందో అర్థంకాకపోయినా అతని సరస హృదయానికి స్పందించి చెప్పింది.

"సరే"

"ముక్తా నువ్వు నా బంగారానివి. నేను చెప్పినట్లు విని, నాలా ఆలోచించు. నువ్వు ఎలాంటి అజ్ఞానంలో ఉన్నావో అర్థమవుతుంది. మనిద్దరి మధ్య ఉండాల్సింది, పెరగాల్సింది స్నేహం. స్నేహానికి ముఖ్య లక్షణం ఒకరి భావాలని మరొకరు గౌరవించడం. అంగీకరించడం. అర్థమైందా?"

"అయింది. మరి ఎయిర్ పోర్ట్ దగ్గర స్థలం కొందాం అంటే మీరు ఒప్పుకోలేదుగా? అంటే నా అభిప్రాయాలు గౌరవించనట్లేగా?"

"కాదమ్మలూ. మనకి ఈ ఇల్లు ఉందికదా? పాపం ఎవరో ఇల్లు లేనివాడు కట్టుకోడానికి లేకుండా కొనేసి కృత్రిమ కొరత సృష్టించాం అనుకోవడం పాపం కదా?"

"ఈ లాజిక్ నేనసలు వినలేదు. మనం కాక పోతే ఇంకెవరో కొనుక్కుంటారు. ఐనా ఇన్వెస్ట్‌మెంట్ కోసం కొనాలి కాని..."

"చూడు బుజ్జీ. మనం ఎంచక్కా మంచి పుస్తకాలు చదివి, మంచి ప్రదేశాలు చూసి, సినిమాలు చూసి ఆనందంగా జీవించాలి కానీ, పైసా పైసా కూడబెట్టి ఆస్తులు సమకూర్చుకుని అనుభవాలు, అనుభూతులు లేకుండా యాంత్రికంగా జీవిస్తే దానికి అర్థమేముంది చెప్పు. ఒకటే జన్మ. అందులోనూ కాస్త విద్యాగంధం అంటుకున్న సంస్కారవంతమైన జన్మ. మరి దాన్ని సార్థకం చేసుకోవద్దా?"

"మీరు చెప్తూంటే బానే ఉంది కానీ మరి రేపు మనకి పిల్లలు పుడితే?"

"పుడితే వాళ్ళని ఆస్తులకి కాకుండా మన సంస్కారాలకి వారసులుగా పెంచుదాం. వాళ్ళు మనలాగే స్వంతంగా వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడాలి కానీ, మనం ఏర్పరిచే అందలాలు మీద కాదు. వాళ్ళు చదవగలిగినంత వరకు చదివించి మంచి పౌరులుగా తయారు చేద్దాం. అంటే, అర్థమైందా?" మృదువుగా అడిగాడు.

"అయింది కానీ సమాజంలో బ్రతుకుతున్నందుకు మరి నలుగురితో నారాయణ అనకపోతే నేను వాళ్ళ ముందు చులకన కానా? నలుగురు ఆడవాళ్ళు కలిస్తే ఏం మాట్లాడుకుంటారో తెలుసా? లేటెస్ట్ బట్టల గురించి, నగల గురించే."

"అదే అజ్ఞానం. నాకో మంచి ఉద్యోగం ఉంది. ఉండటానికి ఇల్లుంది. చాలు. నీకొకటి తెలుసా? వాళ్ళకీ అణుచుకున్న ఎన్నో కోరికలు, ఊహలు ఉంటాయి. ***కానీ సంపద వెనక పరిగెత్తేవాళ్ళు భర్తలు భార్యల కళ్ళకింది నీడలని చూడరు.*** దాంతో వీళ్ళు అందిన దానితో వీళ్ళు అందిన దానితో తృప్తిపడి వారి సంపదలకి ఐ కాన్‌లుగా మారి అందులోని ఆధిక్యతలకి ఆనందిస్తున్నారు. ఒక్క మల్లెపూలమాల ధరించిన నువ్వు ఒళ్ళంతా బంగారం ధరించే స్త్రీలకన్నా ఆనందంగా ఉన్నావు. అవునా? కాదా?"

"నిజం అనే అనిపిస్తోంది" అయిష్టంగానే ఒప్పుకుంది.

"ముక్తా! చిరుజల్లు పడేప్పుడో, శిశిరం వణికించినప్పుడో భర్తసాన్నిహిత్యాన్ని కోరుకోని స్త్రీలు ఉండరు. కానీ భౌతికంగా పక్కనే ఉన్నా మానసికంగా మైళ్ళ దూరంలో ఉన్న భర్తలకి అది టైమ్ వేస్ట్. ఆ కబుర్లు పోచుకోలు మాటలు. విలువలేనివి. ఈ భావదారిద్ర్యం మనకొద్దు. సరేనా?"

"సరే. రాత్రికి కొత్త తెల్ల చీర కట్టుకుంటాను."

"గుడ్ గర్ల్. నాకు తెలుసు ఆముక్తమాల్యద బంగారు కొండ" ఆనందంగా నవ్వాడు సుమంత్.

●●●

ఇప్పుడు ఆముక్త మారింది. సుమంత్‌లాగే ఆలోచిస్తోంది, స్పందిస్తోంది. కానీ ఏకాంతంగా ఉన్నప్పుడు ఆమెకి తరచూ ఒక అనుమానం వస్తూంటుంది. తమిద్దరి భావాలు వ్యతిరేకంగా ఉండి, తను భావకురాలు, సుమంత్ ప్రాక్టికల్ మనిషి అయి ఉంటే, అతను మారేవాడా? లేక తనా?

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story